3 జులై - శ్రీ బలివాడ కాంతారావు జన్మదిన సందర్భంగా ఈ కథ ప్రచురిస్తున్నాం.

# తేనెపట్టు

— బలివాడ కాంతారావు

ఆశకు తెరచుకోవడం, నిరాశకు ముడుచుకోవడం తెలియని నా చిన్న వయసులో ఒక వ్యక్తి పడ్డ శ్రమ, ఈ నాటికీ నా కళ్ళకు కట్టుంది. ఎందుకూ పనికి రాదనుకున్న ఐదు ఎకరాల ఇసుక పర్రను, పళ్ళతోటగా మార్చడానికి అప్పయ్య పడ్డ శ్రమ అది.

అంత శ్రమ పడ్డ అప్పయ్య, ఆ ఫలం అనుభవించకుండానే పోయాడు. ఒకసారి మావూరు వెళ్ళేటప్పుడు నాతో ఆ పల్లెటూరి బడిలో చదువుకున్న అప్పయ్య కొడుకు హరి 'అప్పయ్య తోట'గా పేరు పొందిన ఆ తోటలోనికి తీసుక వెళ్ళాడు. రకరకాల పళ్ళున్నా, నాడు రుచి చూపించిన వాటిలో నాకు తినగా తృప్తి నిచ్చినది ఆ సపోటా పళ్ళే.

ఆ తరువాత బ్రహ్మచారిగా నాకు వచ్చిన, నేను మెచ్చిన సుకన్యను, మనసులో 'సపోటా పండు' అని సంబోధించుకునేవాడిని.

ఉద్యోగరీత్యా దేశంలో తిరిగి, కాశ్మీరు యాపిలు పళ్ళు, కాశీ రేగుపళ్ళు, గోవా మంకూరాలు, ఉత్తర ప్రదేశ్ దసరీలు, అర్గన్ ద్రాక్ష, నాగపూర్ సంత్రాలు, ఔరంగాబాద్ జాములు, రాజమండ్రి సీతా ఫలాలు, బెంగుళూరు దానిమ్మలు, మైసూరు బొప్పాయిలు, హైదరాబాద్ చక్కెర అరటి పళ్ళు, సింహాచలం అనాస పనసలు, అలమండ బంగినపళ్ళు, ఉద్దానం తేనెపనస, ఇలా ఎన్ని అపురూపమైన పళ్ళు తిన్నా, ఏంటో ఆ తొలి 'సపోటా' మోజుతో దానికి మించిన రుచిగల పండు ఇంకొకటి లేదని తేల్చుకున్నాను. యౌవ్వనంలో ఆ సపోటా పండు తిన్నా వయసు మళ్ళినా కూడా ఇంకా ఆ రుచి నానోటిలో నిత్యం వుండి పోయింది.

ఉద్యోగంలో వున్నప్పుడు, నిత్యం వెతుక్కునే జీవితం, రిటైరయ్యాక, నాలుగు రాళ్ళు చేతపడ్డాక లేని సిరి వెతుక్కుని వచ్చినట్లైంది. ఇన్నాళ్ళూ తెరచుకుని వుంచిన ఈ ఆశకు ఒక రూప కల్పన చేద్దామని మా వూరు వెళ్ళాను. నాకు కావలసింది ఒక్క ఎకరం జాగా, ఆ మధ్య చిన్న ఇల్లు కట్టుకుని, ఉన్న శక్తితో అప్పయ్యలా చెమట కార్చి సపోటా పళ్ళు పండించి తిందామని, మావూరు ఎన్నేళ్ళ తరువాతో ఇప్పుడు వెళ్తే నా బాల్య మిత్రుడు హరి వున్నాడు. అప్పయ్య తోట లేదు. ఆ జాగాలో పొగ చిమ్ముతూ ఒక పేపరు మిల్లు బడబడ శబ్దం చేస్తోంది. "తోట ఏం అమ్మేశావ్?" అడిగాను.

"పెద్ద ధర వచ్చింది. ఈ మిల్లు వల్ల వూరికి ఉపకారం కూడా జరుగుతోంది కదా. నా కొడుక్కి ఈ మిల్లులో ఉద్యోగం ఇచ్చారు" అన్నాడు హరి.

ఈ మిల్లు రావడం కాదుగానీ, ఎక్కడా అమ్మడానికి ఒక ఎకరం కాదు కదా, ఒక అర ఎకరం కూడా వూరి దగ్గరిలో దొరకలేదు. భూమి ధర విపరీతంగా పెరిగి పోయింది. నిరాశతో తిరిగి వచ్చాను.

పట్నం శివార్లలో వున్న వేపగుంట గ్రామం దగ్గర రోడ్డుకు దగ్గరలో ఓ ఆరు వందల గజాల జాగా దొరికింది. ఈశాన్య వైపు తవ్విన బావిలో మంచినీరు పడింది. చిన్న ఇంటికి పునాది వేస్తూనే, దక్షిణ వేపు రాళ్ళు రప్పలు యేరి, రకరకాల మొక్కలను వెయ్యడానికి గోతులు తవ్వించాను. వాటిలో గెత్తం నింపి, చెన్నంగి కొబ్బరి, జామి, సీతాఫలం, సువర్ణ రేకతోపాటు దక్షిణ గుమ్మానికి ఎదురుగా నాకు అన్నిటికన్నా ఇష్టమైన సపోటా మొక్కను నాటాను. దీనిని గోవాలోని మడగాం నర్సరీ నుంచి తెచ్చాను. నా మిత్రుడు డికోస్టా ఇంటికి వెళ్ళినప్పుడు వాడి దొడ్లో పండిన సపోటా పళ్ళు తినిపించగానే నాకీ అంటు కావాలని కోరాను. ఇద్దరం దగ్గరలో వున్న నర్సరీకి వెళ్ళి తెచ్చిన సపోటా మొక్క అది. నాటిన మూడేళ్ళకే కాపు మొదలిడినా, నాలుగో ఏటకు బలంగా చెట్టు పెరిగి, ఇంటికన్నా పొడుగ్గా ఎదిగి పోయింది.

పెరట దొడ్డిలో సపోటా చెట్టు చూసిన ఒక చుట్టం "అబ్బే అబ్బే పాలు కారిన చెట్టు ఇంట్లో వుండ కూడదు" అన్నాడు. ఆ రాత్రే అతని భోజనం తరువాత మూడు సపోటా పళ్ళు వలిచి ఇచ్చాను. తింటూ "ఇందులో తేనె పోశావా?" అన్నాడు. "లేదు. మరి అలాంటి చెట్టును పీకేమంటావా?' అంటే అతను మాటాడలేదు. ఉడతలు కొరికెయకుండా రోజూ పలక బారిన కాయలు తీయడానికి చూస్తుంటే ఒక రోజు ఆ పై రెమ్మకు ఒక తేనెపట్టు పెట్టడం చూశాను. ఈ తేనెపట్టు, ఈ సపోటా చెట్టుకు ఒక అలంకరణగా వుంది. ఒక రాణీ ఈగ నా చెట్టు పళ్ళ రుచికి మెచ్చి ఇచ్చిన షీల్డులా వుందా తేనెపట్టు. అమావాస్యకు కుదించి పౌర్ణమి సరికి తేనెతో నిండి కైవారంలో చేటంతగా మారిన ఈ పట్టువైపు చూస్తూ, ఎన్నెన్నో ఆలోచనలతో మనసును నింపుకునేవాడిని. ఆ రెమ్మకున్న సపోటాలు కోస్తే రెమ్మ కదలి వాటికి బాధ కలుగుతుందని, ఆ రెమ్మ ముట్టుకోలేదు. ఆ రెమ్మనించి పండి రాలిన సపోటాలు తేనెకన్నా మధురంగా వుండేవి.

పట్టుకు అంటిపెట్టుకుని వుండే ఈ తేనెటీగల గురించి కొత్త విషయాలు తెలుసుకున్నాను. వాటి పనితనానికి విస్తుపోయే వాడిని. అవి తగరాన్ని బంగారంగా మార్చగలిగే శక్తి గలవిగా తోచాయి. ఆ తేనెపట్టు యేభయి అంతస్తుల నివాస భవనం అనిపించింది. ఆ గదుల్లో అమృతం సృష్టించే అపూర్వ వ్యక్తులు నివశిస్తున్నారనుకునేవాడిని.

నాలో రేగిన వూహలను నాలోనే దాచుకుని ఆనందిస్తున్నాను. ఆ వూహలు నన్ను వుత్తేజితుని చేసే సమయంలో హైదరాబాద్ ఓ నాలుగు రోజులు ఒక సాహిత్య సమావేశానికి వెళ్ళాను. అటునించి తిరిగి రాగానే తేనెపట్టును చూడ్డానికి పెరటకు వెళ్ళాను. అక్కడ తేనెపట్టులేదు. ఏమైంది?

"ఐదు రూపాయలిచ్చి తియ్యించి పడేశాం" అంది



మా ఆవిడ. "నేను లేనప్పుడే ఆ పని ఎందుకు చేశావ్?"

"వెయిమలు బాబాయి వచ్చారు. ఈ తేనెపట్టును చూసి అయ్యో ఇది దక్షిణాన వుంది. అశుభం. వెంటనే తియ్యించాలన్నారు."

"అశుభం అశుభం" వెక్కిరించాను.

"ఇంటికి దక్షిణాన తేనెపట్టు పెడ్తే మరణం తప్పదట. నేను నమ్మక పోతే ఇదిగోండి మన ఇంట్లో వున్న పంచాంగమే తీసి చూపించారు."


నేను పంచాంగం చూడలేదు. అలా దిగాలుగా మాట్లాడకుండా కూర్చున్నాను. ఆ రాత్రి అన్నం సయించలేదు. ఆ తేనెపట్టును చూస్తూ నేను అల్లుకున్న అపురూపమైన వూహాల్ని కనీసం మా ఆవిడ వరం చేసినా బహుశః నేను వచ్చే వరకు ఈ తేనెపట్టును ముట్టకుండా వుండేదేమో?

ఆ రాత్రి నిద్దర పట్టలేదు. అల్లకల్లోలమైన మనసు నన్ను ఆలోచనల వూబిలో దించేసింది. అలా చీకటిలో చూస్తుండగానే నా కళ్ళ ఎదుట ఎవరో కదులుతున్నట్టు అనిపించింది. నిదానించి చూస్తే మాచాయగా అప్పయ్య కొడుకు హరి నిల్చున్నట్టు అనిపించింది.

"అప్పయ్య ఎంత చెమటోడ్చి ఆ చెట్లు పెంచాడో నేను కళ్ళారా చూశాను. నువ్వూ చూశావు. తోట నరకడానికి అమ్మేముందు నీ నాయన మనసును అర్థం చేసుకోలేదెందుకు?"

హరి జవాబు చెప్పకుండానే నా కళ్ళ ఎదరనించి మాయమై పోయాడు. ప్రయత్నించినా ఇంకా నిద్దర రాలేదు. బతికున్న మనుషులే దెయ్యాల్లా ఎదర పడుతున్నా రెందుకో? వీడెవడు? ముకవ్వ మొగుడు కోమలరావు కదూ?

## బాపురే...




"పరిస్థితులు అనుకూలించలేదు. లేకపోతే ఆ సపోటా పండు నాది అయ్యేది కదరా. అలాంటి తీపి పండు విలువ రుచి తెలుసుకోకుండా ఎన్ని హింసలు పెట్టి ఆ ముకవ్వను ఎంత వేగిరం శవంగా మార్చేశావురా?"

కోమలరావు ఒక రాక్షసుడిలా రొప్పుకుంటూ పోయాడు. ఎందుకో నా శరీరం ఇంకా ఏదో శక్తి పూనినట్టు వణికిపోతోంది. వీడెవడు? వైమలు!

"వెయిమలూ - నువ్వెవరిని కూల్చావో నీకు తెలుసా? ఆ తేనెపట్టులో అసలు ఎవరున్నారో తెలుసుకున్నావా? ఆ రాణీ ఈగ రోజుకు పదిహేనువందల గుడ్లు పెట్ట గలదని తెలుసా? దాని జీవిత కాలంలో పది లక్షల సంతానాన్ని సృష్టించగలదని తెలుసుకున్నావా? విత్తనాలు తినే పక్షులూ, ప్రాణులూ ఈ తేనెటీగలపై ఆధారపడి వున్నాయని తెలీదా? పుప్పొడిని పూల పాత్తికదువుల్లోనికి జార్చి విత్తనాల సృష్టికి దోహదం చేసేది ఈ తేనెటీగలని తెలుసుకోలేదా? ఒరే వెయిమలూ... మామూళ్ళలు పదజాలాన్ని తియ్యని కవిత్వంగా మార్చగలిగే శక్తి వంతులూ, వూలపారభాన్ని తేనెగా మార్చగలిగే సైంటిస్టుల కూడలిని ఒక్కసారి పొగబెట్టించి కాల్చి కూల్చడానికి నీ చేతులెలా వచ్చాయిరా, నీ మూఢ నమ్మకాలతో ఇంత గొప్ప జాతిని హతమార్చే అధికారం నీకెవడిచ్చాడురా!" అరుస్తున్నాను.

తన పనిని సమర్థించుకోడానికి, పంచాంగం పట్టుకొని వస్తున్న వెయిమలును వెంట తరమడానికి లేచాను. వెయిమలు బదులు ఇంకెవరో మాచాయగా కనిపిస్తూ ముందు కొచ్చాడు. కాకీ డ్రెస్సు. బొద్దు కట్ మీసాలు. మనిషిని చూడలేదుగాని నీడ ఫోటో ప్రపంచ మంతటా పరిచయమైనదే.

"అన్ని లక్షల యూదులను గ్యాసు చాంబర్సులో పెట్టి నిర్దాక్షిణ్యంగా నిలువునా ఎలా చంపగలిగావ్? ఆ నిర్దోషులు నీలాంటి మనుషులేకదా! నీకు వున్న ప్రేమానురాగాలు, ఆశలూ కోరికలూ అన్నీ వాళ్ళకూ వుంటాయని ఎందుకు ఆలోచించలేదు?"

జవాబులేదు. మనిషే లేదు.

మనిషిని దేముడు సపోటా పండుగా సృష్టించాడు.

హరి, కోమలరావు, వెయిమలు, హిట్లర్ ఇలాంటి వాళ్ళే, ఆ సపోటాపండులో చేరిన పురుగులు. ఆ తీపిని తిని, దానినే హతమార్చే వాళ్ళు.

